
# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

## క్రైస్తవ తెలుగు మాసపత్రిక

JUNE - 2004

[illegible]




TEJA TV

MAA TV

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు

మా టి.వి.లోను

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు

తేజ ఛానల్ లోను చూడండి.

ప్రతి గురువారం : SITI కేబుల్ & IN కేబుల్‌లో

ఉదయం 7:00 గంటలకు,

సాయంత్రం 5:30 గంటలకు

కాకినాడలో మాత్రమే చూడండి.

ప్రసంగీకులు : Bro. జాషువా గూటం

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు విన్పించండి !!!

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722



Editor :
Joshua Gootam


*Pleading for Restoration of First Century Christianity*


సంపుటిక 24 — జూన్ 2004 — సంచిక 11


# యేసుక్రీస్తు దేవుని కుమారుడని క్రైస్తవులు ఏల నమ్ముదురు ? - 2

(Why Christians believe Jesus Christ is the Son of God)

యేసుక్రీస్తు దేవుని శక్తివలన కన్యయైన మరియకు జన్మించెనని, ఆయన దేవుని కుమారుడని అనేకులు సాక్ష్యమిచ్చిరని గత పాఠంలో నేర్చుకొన్నాము. యేసుక్రీస్తు కూడ "దేవుడు తన సొంత తండ్రి అని చెప్పి తన్ను తాను దేవునితో సమానునిగా చేసికొనెను. అందు నిమిత్తము యూదులు ఆయనను చంపవలెనని మరి ఎక్కువుగా ప్రయత్నము చేసిరి" (యోహాను 5:18). చివరిగా వారు యేసును పట్టుకొని రోమా గవర్నరయిన పిలాతు నొద్దకు యేసును తీసికొనివచ్చి ఆయనను సిలువ వేయుము; సిలువ వేయుము అని కేకలు వేసిరి. ఆయన యందు నాకు ఏదోషమును కనబడలేదు అని పిలాతు అనగా, అందుకు యూదులు మాకొక నియమము కలదు; తాను దేవుని కుమారుడను అని ఇతడు చెప్పుకొనెను గనుక ఆ నియమము చొప్పున ఇతడు చావవలెనని అతనితో చెప్పిరి (యోహాను 19:6-7). యూదులు ద్వేషము

వలన యేసును, సిలువవేసి చంపిరిగాని, యేసు సమాధి చేయబడిన మూడవ దిన మున సమాధిని జయించి సజీవుడై తిరిగి లేచుట ద్వారా దేవుని కుమారుడుగా ప్రభావ ముతో నిరూపింపబడెను (రోమా 1:4).

యేసుక్రీస్తు దేవుని కుమారుడు అని మనము నమ్మునట్లు యేసును గూర్చి వందలాది సంవత్సరములకు ముందు నుండే దేవుడు తన ప్రవక్తల ద్వారా ప్రవచించెను. బైబిలునందు యేసు యొక్క జననము, జీవనము, మరణము, పునరుత్థానములను గూర్చిన ప్రవచనము లనేకము లున్నవి. వానిలో కొన్ని అవి నెరవేరు సరికి 1500, 1000 సం॥ల కంటె ముందు చెప్పబడినవి. పాతనిబంధలోని ఆఖరి పుస్తకమయిన మలాకీ గ్రంధము క్రీస్తుకు పూర్వము 450 సం॥లకు ముందే ముగించబడినందున క్రీస్తును గూర్చి చెప్పబడిన ప్రవచనములు అవి నెరవేరుసరికి కనీసము 450 సం॥ల పాతవై యున్నవన్నమాట. దీనినిబట్టి వందలకొలది సంవత్సరములు ముందుగానే దేవుడు తన కుమారుని గూర్చి ప్రజలకు గురుతుల నిచ్చెను అని మనము గ్రహించవలెను. ఇప్పుడు పాత నిబంధలోని ప్రవచనములను మనము కొన్నిటిని చదివి అవి యేసుక్రీస్తులో ఎట్లు నెరవేరెనో గ్రహించుదాం. పాత నిబంధనలో యున్న ప్రవచనములన్నిటిని గమనించుటకు మనకు సమయము చాలదు గనుక కొన్నిటిని మాత్రమే గమనించుదాం.

ఆదికాండము 3:15లో జగద్రక్షకుని గూర్చిన మొట్టమొదటి ప్రవచనము, మనకు కన్పడుచున్నది. ఆయన స్త్రీ సంతానమై యుండునని (అంటే పురుషుని మూలముగా కలిగిన వాడు కాదు అని) యెహోవా దేవుడు చెప్పెను. అయితే గలతీ 4:4లో మనము చూచిన, "కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కమారుని పంపెను; ఆయన స్త్రీ యందు పుట్టెను" అని పరిశుద్ధాత్ముడు పౌలుద్వారా వ్రాయించెను. యేసుక్రీస్తు పురుషుని ఎరుగని కన్యగర్భమున జన్మించెను. అందువలన ఆయన స్త్రీ సంతాన మాయెను.

క్రీస్తు బెత్లెహేములో జన్మించును అని మీకా 5:2లో ప్రవచింపబడెను. "రాజైన హేరోదు దినములయందు యూదయ దేశపు బెత్లెహేములో యేసు పుట్టిన పిమ్మట ఇదిగో తూర్పుదేశపు జ్ఞానులు యెరూషలేమునకు వచ్చిరి" యని మత్తయి 2:1లో దాని నెరవేర్పు మనకు కన్పడు చున్నది.

యేసును గూర్చి యెషయా ప్రవక్త 700 సం॥లకు ముందే, "ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి

ఇమ్మానుయేలను పేరు పెట్టును" అని ప్రవచించెను (యెష 7:14). ప్రవచింపబడిన రీతిగానే ఆయన కన్యయైన మరియకు జన్మించెను అని మత్తయి 1 అధ్యా. లూకా 1 అధ్యా. చదువుట వలన మనము గ్రహించ గలము.

యేసు బాలుడైయుండగా ఐగుప్తు నకు కొనిపోబడును అని హోషేయ 11:1లో ప్రవచింపబడెను. హేరోదురాజు పసిబాలు డైన యేసును సంహరింపజూచు చున్నాడని ప్రభువు దూత యోసేపుకు తెలియజేయ గానే అతడు లేచి రాత్రివేళ శిశువును, తల్లిని తోడుకొని ఐగుప్తునకు వెళ్ళి హేరోదు మరణము వరకు అక్కడ ఉండెను అని మత్తయి 2:14లో మనము చదువగలము.

యేసు యోర్దాను నది అద్దరిని, గలి లయ ప్రదేశమున సువార్త ప్రకటించునని యెషయా 9:1లో ప్రవచింప బడెను. యోహాను చెరపట్ట బడెనని యేసు విని గలిలయకు తిరిగి వెళ్ళెను అని మత్తయి 4:12 దాని నెరవేర్పును మనకు సూచించు చున్నది.

ఆయన తన ప్రజల వలన తృణీ కరింపబడుననియు, విసర్జింపబడు ననియు యెషయా 53:3లో ప్రవచింప బడితే, "ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు" అని యోహాను వ్రాసెను (యోహాను 1:11).

యేసును తన స్నేహితుడొకడు అప్పగించును అని కీర్త 41:9లో ప్రవచింప బడెను. ఆయన అపొస్తలులగు పన్నెండు మందిలో యొకడగు ఇస్కరియోతు యూదా ఆయనను అప్పగించుట ద్వారా అది నెరవేరెను (మార్కు 14:10). యేసును అతడు ముప్పది వెండి నాణెములకు అప్ప గించునని, ఆ ధనమును, అతడు తిరిగి ఇయ్యగా దానితో కుమ్మరివాని పొలము కొనబడునని జెకర్యా 11:12, 13లో ప్రవచిం పబడెను. మత్తయి 27వ అధ్యాయమును మనము చదివిన యెడల యేసును అప్ప గించి నందుకు ఇస్కరియోతు యూదా పశ్చాత్తాపపడి ఆ ముప్పది వెండి నాణెము లను యూదుల అధికారులకు తిరిగి ఇయ్యగా వారు ఆలోచన చేసి పరదేశులను పాతిపెట్టుటకు కుమ్మరివాని పొలమును ఆ డబ్బుతో కొనిరి అని మనము గ్రహించ గలము.

యేసుపై అబద్ధ సాక్షులు లేతురు అని కీర్తన 27:12లో ప్రవచింపబడెను. మత్తయి 26:57-60 వరకు చదివితే యేసును చంపవలెనని ప్రధాన యాజకు లును, మహాసభ వారందరును ఆయనకు విరోధముగా అబద్ధ సాక్ష్యము వెదుకగా

చివరకు ఇద్దరు మనుష్యులు వచ్చి ఆయన మీద అబద్ధ సాక్ష్యము పల్కినట్లు మనము కనుగొనగలము.

అతిక్రమము చేయువారిలో ఆయన ఎంచబడునని యెషయా 53:12లో ప్రవచింపబడెను. అది నెరవేరునట్లు ఆయన కుడివైపున ఒకడును ఎడమవైపున ఒకడును ఇద్దరు బందిపోటు దొంగలు ఆయనతో కూడ సిలువ వేయబడిరి యని మత్తయి, మార్కు, లూకా అనువారు వ్రాసిన సువార్తలలో మనము కనుగొనగలము (మత్తయి 27:38; మార్కు 15:27, 28; లూకా23:33).

ఆయన దప్పిగొనగా ఆయనకు చేదు చిరక ఇత్తురు అని కీర్తనలు 69:21లో దావీదు ప్రవచించెను. యేసు సిలువపై వ్రేలాడుచు నేను దప్పిగొనుచున్నాననెను. వారు ఒక స్పంజీ చిరకతో నింపి, హిస్సోపు పుడకకు తగిలించి ఆయన నోటికి అందించిరి యని యోహాను 19:29లో మనము అది నెరవేరుట చూడగలము. తన శత్రువుల కొరకు ఆయన ప్రార్థించును అని కీర్తన 109:4లో ప్రవచింపబడెను. యేసు తనను సిలువ వేసిన వారిని చూచి, "తండ్రీ, వీరేమిచేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని" ప్రార్థన చేసెను (లూకా 23:34).

దేవుని యొక్క ఏకైక కుమారుడు పొడువబడును అని జెకర్యా 12:10లో ప్రవచింపబడెను. యేసు సిలువమీద యుండగా, "సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్క పొడిచెను, వెంటనే రక్తమును నీళ్ళును కారెను" అని యోహాను 19:34లో మనము చూడగలము. యేసు యొక్క యెముకలన్నియు కాపాడబడును, వాటిలో ఒక్కటియైనను విరిగిపోదు అని నిర్గమ 12:40లోను, కీర్తన 34:20లోను ప్రవచింపబడెను . యోహాను 19:31-38 వరకు మనము చూచిన సైనికులు వచ్చి యేసుతో కూడ సిలువ వేయబడిన ఇద్దరి కాళ్ళను విరుగగొట్టిరి గాని వారు యేసునొద్దకు వచ్చి అంతకుముందే ఆయన మృతి పొంది యుండుట చూచి వారు ఆయన కాళ్ళు విరుగగొట్ట లేదు అని గమనించగలము.

ఆయన మరణమైనప్పుడు ధనవంతుని యొద్ద ఉంచబడును అని యెషయా 53:9లో ప్రవచింపబడెను. మత్తయి 27:57-60వరకు చూచిన అరిమతయి యోసేపు అను ఒక ధనవంతుడు పిలాతు నొద్దకు వెళ్ళి యేసు దేహమును తనకిమ్మని అడిగి తీసుకొని, తాను రాతిలో తొలిపించు కొనిన క్రొత్త సమాధిలో దాని నుంచెనని మనము గమనించగలము.

యేసు చనిపోయినను తిరిగి లేచును

అని కీర్తన 16:10లో ప్రవచింపబడిన రీతిగానే ఆయన సమాధి నుండి సజీవుడై లేచినట్లు మత్తయి, మార్కు, లూకా, యోహాను లు వ్రాసిరి. తోమా అనుశిష్యుడు ఆయన గాయములలో చేతులుంచి, విశ్వసించి నా ప్రభువా, నా దేవా అని ఆయనను మ్రొక్కెను (మత్తయి 2:89; లూకా 24:36–48; యోహాను 20:26–29).

యేసు సమాధి నుండి తిరిగి లేచిన తరువాత పరలోకమునకు ఆరోహణుడై పోవును అని కీర్తన 68:18లో దావీదు ప్రవచించెను. యేసు తన శిష్యులను "బేతనియ వరకు తీసికొనిపోయి చేతులెత్తి వారిని ఆశీర్వదించెను. వారిని ఆశీర్వదించుచుండగా ఆయన వారిలో నుండి ప్రత్యేకింపబడి పరలోకమునకు ఆరోహణుడాయెను" అని లూకా వ్రాసెను (లూకా 24:50, 51; అపో.కా. 1:9).

పాతనిబంధనలో యేసును గూర్చి వందలకొలది సంవత్సరలకు ముందే చెప్పబడిన అనేక ప్రవచనములలో కొన్నిటిని మాత్రమే చూపిస్తూ వాటి నెరవేర్పును కూడ క్రొత్త నిబంధనలో నుండి మీకు తెలియజేసాను. ఈ ప్రవచనములను ప్రవచించినవాడు, వాటిని అనేక సంత్సరముల తరువాత నెరవేర్చినవాడు దేవుడే. అందువలన యేసుక్రీస్తు దేవునిచేత పంపబడిన రక్షకుడని, ఆయనే దేవుని కుమారుడని మనము తప్పక విశ్వసింప వచ్చును గదా.

నెరవేర్చబడిన ఈ ప్రవచనములన్నియు యేసు దేవుని కుమారుడని నిరూపించుట మాత్రమే గాక, పాత నిబంధనను వ్రాసిన లేఖకులు వారి స్వజ్ఞానమును బట్టి దానిని వ్రాయలేదు గాని దైవ నడిపింపుచే వ్రాసిరి యని అవి ధృఢముగా మనకు నిరూపించుచున్నవి. 2 పేతురు 1:20–21 ఇట్లు చెప్పుచున్నది : "ఒకడు తన ఊహను బట్టి చెప్పుట వలన లేఖనములలో ఏ ప్రవచనమును పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్చను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగా పలికిరి". అందువలన పాత నిబంధనను మనము చదువునప్పుడు అది మానవకల్పిత గ్రంధమని తలంచక, దైవ ప్రేరితమైన, పరిశుద్ధ గ్రంధమని చదువవలెను.

యేసుక్రీస్తు దేవుని కుమారుడని మనమేల నమ్మవలెను? ఆయన దేవుని వలన కన్యకు జన్మించినందున, అనేకులు ఆయనే దేవుని కుమారుడు అని ఇచ్చిన సాక్ష్యము వలన దేవుడే తన కుమారుని గూర్చి చేసి నెరవేర్చిన ప్రవచనముల వలన మనము యేసునందు విశ్వసింపవలెను.

అందువలననే యేసు ఇట్లనుచున్నారు : "మీ హృదయమును కలవరపడనియ్య కుడి; దేవుని యందు విశ్వాసముంచు చున్నారు. నాయందును విశ్వాసముం చుడి" "నేనే మార్గమును, సత్యమును, జీవమును, నాద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" (యోహాను 14:1, 6). మీరు క్రీస్తు పాదముల యొద్ద కూర్చొని, ఆయన ఆజ్ఞలను విని వాటిని శిరసావహించిన యెడల ఆయనే మీకు మోక్షమును దయచేయ గలడు !

- జాషువా గూటం

❄ ❄ ❄ ❄

# ద్రాక్షతోటలో పనివారు

( Labourers in the Vineyard)

*మత్తయి 20:1-16*

మత్తయి సువార్త 20వ అధ్యాయ ములో యేసుప్రభువు చెప్పిన ఒక ఉపమాన మును ఈ రోజు చూచుకొందము: పరలోక రాజ్యము ఇక ఇంటి యజమానుని పోలి యున్నది. అతడు తన ద్రాక్షతోటలో పనివారిని కూలికి పెట్టు కొనుటకు ప్రొద్దున బయలు దేరి దినమునకు ఒక దేనారము చొప్పున పని వారితో ఒడవడి తన ద్రాక్ష తోటలోనికి వారిని పంపెను. తరువాత దాదాపు తొమ్మిది గంటలకు, పండ్రెండు గంటలకు, మూడు గంట లకు, అయిదు గంటలకు వెళ్ళి పనిలేక ఊరకనే నిలిచి యున్న వారిని నా ద్రాక్షతోట లోనికి వెళ్ళుడనెను. సాయం కాలమైన ప్పుడు ఆ ద్రాక్షతోట యజమా నుడు తన గృ నిర్వాహకుని పిలిచి వారికి కూలి ఇమ్మని చెప్పెను. దాదాపు అయిదు గంటలకు కుదిరిన వారు వచ్చి ఒక్కొక్క దేనారము చొప్పున తీసి కొనిరి. మొదటి వారు వచ్చి తమకు ఎక్కువ దొరకునను కొనిరి. గాని వారికిని ఒక్కొక్క దేనారము చొప్పుననే దొరకెను. వారది తీసి కొని సణగుకొనిరి. అందుకు ఆ యజమా నుడు వారిలో ఒకని చూచి, నేను నీకు అన్యాయ ము చేయలేదు. నీవు నా యొద్ద ఒక్క దేనారమునకు ఒడబడితివి. నీ కిచ్చినట్లే కడపట వచ్చిన వీరికిచ్చుటకును నా కిష్టమైనది. అని చెప్పెను. ఈ ప్రకారమే కడపటివారు మొదటి వారగుదురు, మొదటివారు కడపటి వారగుదురు అని

2యేసు బోధించారు.

యేసు ప్రభువు పరలోక రాజ్యము ను గూర్చి చెప్పిన ఉపమానములలో ఇదొకటి. పరలోక రాజ్యమనగా క్రీస్తు యొక్క సంఘమే. మత్తయి 16:18లో యేసు ప్రభువు పేతురుతో "ఈ బండమీద నా సంఘమును కట్టుదును" అని చెప్పారు. మరల 19వ వచనములో పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు నీ కిచ్చెదనని ఆయన అతనితో అన్నారు. ఈ సందర్భములో సంఘము, రాజ్యము అనునవి ఒకదాని కొకటి పర్యాయ పదములుగా వాడబడినవి.

సంఘాన్ని యేసు ప్రభువు ఒక ద్రాక్ష తోటగా ఇక్కడ పోల్చి చెప్పారు. ద్రాక్ష తోటలో పనివారు పనిచేయుటకు పిలువబడ్డారు. క్రీస్తు సంఘములో యున్న ప్రతివాడు ఒకపని వాడే కావాలి. అతడు చేయవలసినది కొంత యున్నది. అపో.పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "మీరు విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడి యున్నారు; ఇది మీ వలన కలిగినదికాదు, దేవుని వరమే. అది క్రియల వలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయ పడవీలు లేదు. మరియు వాటి యందు మనము నడుచు కొనవలెనని దేవుడు ముందుగా సిద్దపరచిన సత్‌క్రియలు చేయుటకై మనము క్రీస్తు యేసు నందు సృష్టింపబడిన వారమై ఆయన చేసిన పనియై యున్నాము" (ఎఫెసీ 2:8-10). మరియు మీరు భయముతోను వణకుతోను మీ సొంత రక్షణను కొనసాగించు కొనుడియని అతడు ఫిలిప్పీ 2:12లో కూడ చెప్పాడు.

యేసు ప్రభువు చెప్పిప ఉపమానములో పనివారు ఉదయం తొమ్మిది గంటలకు, పంద్రెండు గంటలకు, మధ్యాహ్నం మూడు గంటలకు, చివరిగా అయిదు గంటలకు కూడ కూలికి పిలువబడిరి. ప్రతివాడు పిలువబడి ద్రాక్ష తోటలో పనిచేయడానికి పంపబడ్డాడు. సాయంకాలమైనప్పుడు చివర వచ్చిన వానికి మొదలుకొని మొదట వచ్చిన వాని వరకు కూలి ఇయ్యబడింది. ప్రతి వానికి ఒక్కొక్క దేనారము చొప్పున ఇయ్యబడినది. మొదట వచ్చిన వారు తమకు ఎక్కువ దొరకునను కొనిరి గాని వారికి కూడ ఒక్కొక్క దేనారము చొప్పుననే ఇయ్యబడెను గనుక వారు సణుగు కొన్నారు. వారి కేమి అన్యాయము జరుగలేదని వారు ఒప్పుకొన్నంత మేరకు వారికీయబడెనని ఆ యజమానుడు తెలియ జేసాడు. ఈ విధముగా మొదటివారు కడపటివారు, కడపటివారు మొదటి వారు అయ్యారు.

ఈ సందర్భములో చివరివారు

తాము చేసిన పనికంటె పొందిన ప్రతిఫలము యొక్క నిష్పత్తి ఎక్కువ యని మనము గ్రహించగలము. మొదట వచ్చిన వారి ప్రతిఫలము యొక్క నిష్పత్తి తక్కువ. నీవు ఇంతపని చేస్తే నేనింత ఇస్తాననే ఒప్పందము చేయబడలేదు గాని, ప్రతి సందర్భములోను ఇయ్యబడిన బహుమానము సంపూర్ణమైనది. మొదట వచ్చిన వారికి తప్ప మిగిలిన వారందరి విషయంలోను యజమాని యొక్క విస్తారమైన ధాతృత్వము వ్యక్తమగు చున్నది. మొదట పిలువబడిన వారి విషయంలో రోజుకొక దేనారము చొప్పున ఒప్పందము జరిగినది. మిగిలిన వారి విషయములో మట్టుకు యజమాని కృప వ్యక్తమగు చున్నది.

ఈ ద్రాక్ష తోట పనివారికి దేవుని రాజ్యములో పని వారికిని పోలికలున్నవి. క్రీస్తు కొరకు పని చేయడానికి పేతురు, మిగిలిన అపొస్తలులు సమస్తాన్ని విడిచి పెట్టారు. యేసు ప్రభువుతో పేతురు "ఇదిగో మేము సమస్తమును విడిచి పెట్టి నిన్ను వెంబడించితిమనగా, అందుకు యేసు ఇట్లనెను: నా నిమిత్తమును సువార్త నిమిత్తమును ఇంటినైనను అన్నదమ్ములనైనను అక్క చెల్లెండ్రనైనను తల్లిదండ్రులనైనను పిల్లలనైనను భూములనైనను విడిచిన వాడు ఇప్పుడు ఇహమందు హింసలతో పాటు నూరంతలుగా ఇండ్లను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తల్లులను పిల్లలను భూములను రాబోవు లోకమందు నిత్యజీవమును పొందునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. మొదటి వారనేకులు కడపటి వారగుదురు, కడపటి వారు మొదటి వారగుదురు అనెను" (మార్కు 10:28-31).

మంచి అవకాశములు కలిగిన వారే దేవుని రాజ్యములో బహుమానం పొందుతారను కొననవసరం లేదు. సంఘములో పని చేయడానికి అందరికీ సమాన అవకాశములున్నాయి. కాని మొదటి వారనేకులు కడపటి వారగుదురను మాట నిజం. యేసు ప్రభువును వెంబడించిన వారిలో ఇస్కరియోతు యూదా ఇంచుమించు మొదటి వాడే గాని అతడు నిత్యజీవాన్ని పోగొట్టుకొన్నాడు. యౌవనుడైన ధనవంతుడొకమారు నిత్యజీవాన్ని వెదకుచూ యేసు దగ్గరకు వచ్చాడు. అయితే ఆయన చెప్పిన పని చేయలేక ముఖం చిన్నబుచ్చుకొని వెళ్లిపోయాడు, కడపటి వాడయ్యాడు.

పనివారు పొందదగిన దానికంటె ప్రభువు ఎంతో ఎక్కువ యిస్తారు. మీరు చేసిన పనిని, చూపిన ప్రేమను మరచుటకు దేవుడు అన్యాయస్థుడు కాడని హెబ్రీ 6:10లో వ్రాయబడి యున్నది. ఆయన తన

పనివారిని మరువడు. మన మెంత చేసినా ఆయనకు నిష్ప్రయోజకులమైన దాసులమే (లూకా 17:10). అయినను నిత్యజీవాన్ని ఆయన మనకు వాగ్దానం చేసారు.

యౌవనులు తమ యౌవనకాలంలో ప్రభువును వెంబడించి వృద్ధులగు వరకు, లేదా మరణపర్యంతము నమ్మకముగా పని చేయాలి. వృద్ధులు కూడ కాలమును పోనీయక ప్రభువుకు లోబడితే వారు రక్షింపబడగలరు. మీరు ఏ వయస్సులో యున్నా ప్రభువునందు నమ్మికొనండి, మీ పాపముల విషయమై మారుమనస్సు పొందండి, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొంది రక్షింపబడిన వారితో కలిసి ప్రభువు పని చేయండి.

- జాషువా గూటం.

❄ ❄ ❄ ❄

# "ఏ అధికారము వలన నీవు ఈ కార్యములు చేయుచున్నావు?"

(BY what authority Dust thou doeth these Things?)

మత్తయి 21:23

ఉపోద్ఘాతము : యేసు ప్రభువు దేవాలయములో బోధించుచుండగా ప్రధాన యాజకులు, పెద్దలు ఆయననూ ఈ ప్రశ్న అడిగిరి.

ఆయన దేవాలయ పనులలో మార్పులు తెచ్చుచున్నారు (మార్కు 21:12-13). మరియు బోధలో కూడ మార్పులు తెచ్చు చున్నారు (మత్తయి 5:38-45). ఒక యూదుని వలె ఆయనకు రాజకీయముగా గాని, మత పరంగా గాని యేమీ అధికారం లేదు. అందువలన వారి అనుమతి లేకుండా ఆ పనులు ఎందుకు ఆయన చేయు చున్నారో తెలిసికొనగోరారు.

యేసు చేసింది, చెప్పింది మానవాతీతమైన స్థావరం నుండి వచ్చినది. అది దైవాధికారము బడసినది (మత్త 17:5 28:18; హెబ్రీ 1:1, 2).

అధికారము యొక్క ఆవశ్యకతన ఆ ప్రశ్న వక్కాణించుచున్నది :

అధికారమును మనం గుర్తించకపోతే మానవ జీవనంలో ఎక్కడా సమైక్యత వుండదు. సజావుగా సాగదు. ఆర్థి

స్థాయిని గుర్తించకపోతే వ్యాపారము, వర్తకము బంద్ అయిపోతాయి. ప్రతివాడు తనకిష్టమొచ్చి నట్లుగా డబ్బుకు విలువ కడితే ఎట్లుంటాది? ఆలాగే తూనికలు, కొలమానముల విషయంలో మనకొకస్థాయి లేకపోతే గొప్ప గందరగోళం ఈ లోకంలో యుంటాది. ఒక అడుగుకు ఎన్ని అంగుళాలు? ఎన్ని అడుగులైతే ఒక గజము? ఒక పౌండులో ఎన్ని ఔన్సులు? ఒక టన్నులో ఎన్ని కేజీలు? ఆలాగే ప్రతివాడు తన వాచీలోని టైమే కరక్టను కొంటే ఇంకెంత గందరగోళం?

## సాంప్రదాయక పద్ధతులను అధికారముగా అంగీకరించెదమా?

'అవును' అని రోమన్ కేథలిక్కులంటారు. పాత క్రొత్త నిబంధనల లోని దేవుని వాక్యముతో సమానముగా నోటి ద్వారా చెప్పబడిన సాంప్రదాయ సంగతులను అంగీకరించాలని వారంటారు.

రికార్డు చేయబడని సంగతులనేకములను క్రీస్తు బోధించారని వారు చెబుతారు. యోహాను 21:25ను బట్టి వారట్లు చెబుతారు. అయితే అది ఆయన చేసిన బోధలను గాక, చేసిన క్రియలను గూర్చి చెబుతుంది. రోమన్ కేథలిక్కులు చేయు అదనపు బోధ అంతా మానవ పారంపర్యముల వలన కలిగింది. ఆ పారంపర్యములు దైవికమయితే అవి బైబిలులో ఎందుకు చేర్చబడలేదు? బైబిలు పరిపూర్ణ మార్గదర్శి కాకపోతే దేవుడు దానిని ఎందుకిచ్చారు? మనలను పరిపూర్ణంగా ఏదైనా నడిపించకపోతే, దాన్ని ఆయన ఎందుకు యిచ్చినట్లు?

ఈ ఆరోపణలకు అనుగుణంగా కొందరు మత్తయి 28:20ని వాడుకొంటారు. క్రీస్తు మనతో యుంటానని అక్కడ ఆయన వాగ్దానం చేసారు. గాని మనం ఆయన మాటకు కలపాలనికాదు.

మనం చరిత్రలో వెనుకకు వెళ్లకొలదీ, మానవ పారంపర్యాచారము పవిత్రంగా యుండాలి. అయితే కేథలిక్కుల పారంపర్యములు విషయములో యిది సత్యం కాదు. ఉదాహరణకు సంవత్సరాల తరబడి మరియ ఆశ్చర్యంగా గర్భంలో పడడం, శరీరముతో పైకెత్తబడడం అనునవి కేథలిక్కులకు తెలియదు. అయితే యివి క్రొత్తగా ప్రవేశపెట్టబడిన సూత్రాలు. అట్టివి నమ్మదగిన పారంపర్యములు కావు. వాటికి దైవిక బలం యేమీలేదు.

## మన పితరుల మతాన్ని అధికారంగా అంగీకరించుదమా?

1. అనేకులు అట్టి దానిని అంగీకరించారు. తమ పూర్వీకులు కొన్ని శతాబ్దముల

క్రితము పామరులైనను వారి మతాన్నే 2వెంబడించే వారున్నారు.

2. దీని వలన ఒక సమస్య ఉద్భవించును. ప్రతివ్యక్తి తన తరములను వెనుకకు వెళ్లిన అతడు 128 తరములను కలిగిన వాడగును. అయితే ఈ తరాలన్నిటిలో ఏకత్వము లేదు. మనపూర్వీకులను వెంబడిస్తే, ఈ 128 మందిలో ఎవరిని వెంబడించాలి?

3. పౌలు తన పితరులను కొంత మట్టుకు వెంబడించాడు (గలతీ 1:14). గాని దానిలో మార్పు అవుసరమని గుర్తించాడు (ఫిలి 3:4-8; అపో.కా. 9:1-18).

కొందరు తమ భావాలనే అధికార పూర్వకంగా అంగీకరిస్తారు :

1. మనిషికీ, మనిషికీ వ్యక్తిగత భావాలు వేరుగా ఉంటాయి. ఒకే సంగతిని ఇద్దరు అనుభవించినా, వారి భావాలు వేర్వేరుగా ఉంటాయి. ఉదా: ఇద్దరు మనుష్యులు మద్యం మస్తుగా సేవించారనుకొందాం. అందులో ఒకడు దుఃఖవదనుడగును, రెండోవాడు సంతోషంగా యుండును.

2. మనం నమ్మేది సత్యమైనా అసత్యమైనా మన భావాలు దానిపైనే ఆధారపడి యుంటాయి. యాకోబు తన కుమారుడైన యోసేపు మృతిజెందాడని నిజంగా నమ్మాడు (ఆది.కా. 37:26-36). యదార్థంగా దుఃఖించాడు.

నీ మనస్సాక్షే మార్గదర్శిగా యుండనిమ్ము అనునది మరి కొందరి వాదన :

1. అయితే ఒక వ్యక్తి యొక్క మనస్సాక్షే అధికారస్థావరంగా యుండనిస్తే లోకంలో ఎంతమంది జనులున్నారో అన్ని అధికార స్థావరములుంటాయి. యిది ఫిలిప్పీ 3:16ను ఉల్లంఘించును.

2. నిజమే అనాగరికులు చాల మట్టుకు మనస్సాక్షిగలవారేగాని, వారు మనస్ఫూర్తిగా తప్పు. వారు భక్తిపరులే గాని తప్పులో యున్న భక్తిపరులు.

3. పౌలు మనస్సాక్షిని బట్టియే దూషకుడు, హింసకుడును (1 తిమో1:13; అపో.కా. 26:9; 23:1). అయితే అతని మనస్సాక్షి తప్పును రైటుగాను, రైటును తప్పుగాను చిత్రీకరించలేదు.

మెజారీటి ఎట్లుంటే అదే రైటనే వారుంటారు:

1. ఎక్కడ మెజారిటీ? ఆసియాలో బౌద్ధులు; ఆఫ్రికాలో ముస్లిములు, ఇండియాలో హిందువులు, ఇటలీలో కేథలిక్కులు.

2. ఒక గుంపును వెంబడించడాన్ని

దేవుడు ఖండించారు (నిర్గ 23:2).

3. నోవహు కాలమందు మెజారిటీయే నశించారు (ఆది 6:5-13). తీర్పునాడు యిది కూడ వాస్తవం.

బైబిలు ఒక్కటియే మనం ఆధారపడ తగిన అధికారం :

1. అది మనలను ప్రతి సత్కార్యము నకు సంపూర్ణునిగా చేయును (2 తిమో 3:16-17).

2. అది మన వెలుగు స్థావరం (కీర్త 119: 105).

3. తీర్పునాడు దేవుని వాక్యం మనలను కొలుస్తొది (యోహాను 12:48; ప్రక 20:12).

4. మోషే ధర్మ శాస్త్రముగాక, క్రీస్తు యొక్క నిబంధనయే మన అధికార స్థావరం (హెబ్రీ 8:6-10; కొల 2:14). "ఈ దినముల అంతమందు దేవుడు కుమారుని ద్వారా మాటలాడెను" (హెబ్రీ 1:1,2; మత్త 17:1-5)

✍ - లీరోయ్ బ్రౌన్లో

❄ ❄ ❄ ❄

# దేవుని కృప

(The Grace of God)

## తీతు 2:11-15

దేవుని కృప ఎంతో గొప్పది. ఆయన అందరి యెడల కృప కలిగి యున్నారు. నాకు తప్ప నా కంటే ఎంతో తక్కువ చేయుచున్న వారి యెడల ఆయన కృప ఎక్కువగా ఉన్నదని తలంచుట సహజము ఒక్కోసారి మన బలహీనతలు అత్యధికంగా కనబడ్తాయి. దేవుడు వాటిని క్షమించడని తలస్తాం.

అందువలనే కృప వర్తమానమును తరచు మనము వినవలెను. అనేకులు నిరాశతో జీవించుచున్న లోకంలో మనం వున్నాం. రక్షించబడి, క్షమించబడి తమ జీవితాన్ని నూతనంగా ఆరంభించు కోవచ్చనే తలంపు వారికి వింతగా అగు పడును.

### కృప అందరికీ

"సమస్త మనుష్యులకు రక్షణ కరమైన దేవుని కృప ప్రత్యక్షమాయెను" (తీతు 2:11). గాని అందరు రక్షింపబడరు. "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి, నాశనము నకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునై యున్నది, దాని ద్వారా

ప్రవేశించు వారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది, దాని కనుగొను వారు కొందరే" (మత్త 7:13-14). కృప అందరికీ ప్రత్యక్ష మయ్యింది. అది రక్షణను అందరికీ సాధ్యపరచింది. అయితే దేవుడను గ్రహించు ఈ గొప్ప వరమును అందరు ఉపయోగించుకొనరు.

దేవుని మహోచిత కృపవలన క్రీస్తు అందరికొరకు మరణించెను గనుక కృప అందికీ లభించును (హెబ్రీ 2:9). పౌలు తిమోతికి వ్రాయుచు తాను పాపులలో ప్రధానుడనని చెప్పుకొనెను. పూర్వము దూషకుడు, హింసకుడు క్రీస్తు నామమునకు కీడు తలపెట్టినవాడు. అయితే తన అపారమైన కృపను చూపుచు దేవుడు పౌలును రక్షించెను. మనుష్యులు తమ విపరీతమైన పాపములకు క్షమాపణ క్రీస్తు కృప వలన పొందగలరని దీని వలన వ్యక్తమగు చున్నది.

## రక్షింపబడినప్పుడు మనం మారాలి

కృప వలన రక్షింపబడడం అంటే ఏదో చవకబారు కృపయని బేషరతుగా లభించేదని తలంచవద్దు. పాపులందరు రక్షింపబడవచ్చును. అయితే వారు తమ జీవితాలను మార్చుకొనకపోతే రక్షింపబడలేరు.

మనము భక్తిహీనతను ఇహలోక సంబంధమగు దురాశలను విసర్జించాలని కృప మనకు బోధించు చున్నది. కృప ద్వారా రక్షింపబడుట అంటే అర్ధరహితమగు దురాశలను విసర్జించి జీవించాలి. దేవుని సహాయము వలన మనం మారగలము. మనం మారాలని ఆయన కోరుచున్నారు.

మనం తప్పుచేయడం మానివేయుట మాత్రమే కాదు గాని మార్పుజెందిన జీవితాన్ని జీవించాలని కృప కోరుచున్నది. మనము స్వస్థ బుద్ధితోను, నీతితోను భక్తితోను బ్రదుకుచుండవలెనని కృప కోరుచున్నది.

## ఎదురు చూడడానికి కృప వీలు కలిగించును

క్రీస్తు యొక్క రాక కొరకు మనము భయముతో గాక సంతోషముతో ఎదురు చూడాలని దేవుడు కోరుచున్నాడు.

క్రీస్తు రాకడ శుభప్రదమైన నిరీక్షయని, మహాదేవుడును మన రక్షకుడునైన యేసు క్రీస్తు యొక్క ప్రత్యక్షత కొరకు మనము ఎదురుచూచు చుండవలెనని పౌలు చెప్పాడు.

కృప యొక్క వీక్షణతో మన జీవితాలను మనమే చూచుకొనుట కష్టతరంగా

యున్నది. ఆయన వచ్చినప్పుడు తీర్పు దృక్కోణంతో మనలను చూచి పరలోకమునకు అనర్హులమని ప్రకటిస్తాడేమోననే భయంతో వున్నాం. అయితే మనం పది లక్షల సంవత్సరాలు బ్రదికినా పరలోకానికి అర్హులం కాలేము. మనం ఎంత చేసినా మన నీతి క్రియలన్నీ మురికి గుడ్డలే. అయితే ఆయన మరల వచ్చినప్పుడు పవిత్రపరచు యేసు రక్తమును బట్టి, దేవుని కృప వలననే మనం రక్షింపబడుదుము, పరలోకం చేరుకొందుము.

అనుదినం ఆయనకు సన్నిహితంగా మనం జీవించుట ఆశ్చర్యం కాదా? ఆయన రాక కొరకు వీక్షిస్తు యోహానువలె "ప్రభువైన యేసూ రమ్ము" అని పలుక గలిగితే మంచిది కాదా? ఆయన రాకను మనం సంతోషంతో ఎదురు చూడాలని ఆయన కోరుచున్నారు.

## మనం ప్రత్యేకుల మని కృప యొక్క అర్థం

మనలను కొనడానికి క్రీస్తు తన్ను తాను అప్పగించుకొన్నారు. ఆయన మనలను విమోచించారు. అంటే ఘోరమైన పాప బానిసత్వం నుండి ఆయన మనల్ని విడిపించారు. ఇప్పుడు ఆయన కొరకు స్వతంత్రులుగా మనం జీవించ నెంచు కోవాలి. లేదా సాతాను సంకెళ్లను మరల తగిలించుకొని స్వేచ్ఛాయుతంగా వానికి దాసత్వము చేయాలి.

క్రీస్తు మనలను తన కోసరము పవిత్ర పరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్నుతానే మనకొరకు అర్పించుకొనెను. ఈ లోకమంతా దేవునికి చెందినదే. గాని ఒక ప్రత్యేక రీతిగా క్రైస్తవులు దేవునికి చెందినవారు. మనం ఆయన ప్రత్యేకమైన సొత్తు. అయితే మనలను ప్రత్యేక పరచున దేదో గమనించు: మనము సత్ క్రియల యందాసక్తి గలవారమై యుంటే ప్రత్యేకంగా యున్నవారమగుదుము. దేవుని యొక్క ప్రత్యేక ప్రజలం అనే తలంపు ఎంత గొప్పదో!

కృప యొక్క వర్తమానమును మించిన మనోహర వర్తమానం ఇంకోటి యుండదు. దాని ద్వారానే మనందరం రక్షింపబడుదుము. అయితే రక్షింపబడిన వారి నుండి యేమీ కోరనిదని కృపా మార్గమును గూర్చి పొరబడవద్దు. ఒక్కోసారి మన రక్షణలో కృప యొక్క పాత్రను అపార్థం చేసికొంటాము. అట్లు కారాదు.

- లియోన్ టార్స్

❄ ❄ ❄ ❄

# సంఘమును ఎప్పుడు కించపరచవద్దు

(Don't Ever Make Fun of the Church)

సంఘమును ఒక మానవ కల్పిత సంస్థగా, ప్రాధాన్యత లేని సంస్థగా చూచే వారు 'క్రైస్తవలోకంలో' నేడు అనేకు లున్నారు. 'పరలోకానికి వెళ్లాలంటే దానిలో సభ్యులవనక్కర లేదని వారు చెబుతారు. నేడు అనేక మతశాఖల సంఘాలున్నాయి. గనుక అన్ని సంఘాలు మంచివేయని వారు చెబుతారు. ఈ మతశాఖలను సమర్ధించు టకుగాను, వారు అవన్నీ కలసి బైబిలులో మనకు కనబడే సంఘమవుతా యుంటారు. మరికొందరు యోహాను సువార్త 15వ అధ్యా యములోనికి వెళ్లి క్రీస్తు ద్రాక్షవల్లియని వివిధ మతశాఖలన్నీ తీగెలని చెబుతారు.

అయితే విచారింపదగిన సంగతి యేమంటే కొందరు క్రీస్తు సంఘాన్ని కించపరుస్తారు, దాన్ని గూర్చి వేళాకోళం ఆడతారు, దానికేమీ ప్రాముఖ్యత లేనట్లు ప్రవర్తిస్తారు. ఒకేఒక్క సంఘమున్నదని, అది రక్షింపబడిన వారితో సమకూడినదని, పరలోకమునకు వెళ్లాలంటే ఒకడు దానిలో సభ్యుడై యుండాలని బోధించు వారిలో తప్పు పట్టుకొనుటకు చాల ప్రయత్నిస్తారు.

వివిధ మానవులచే స్థాపించబడిన వందలాది సంఘాలు నేడున్నాయి. వాటిలో చాలా సంఘాలు 200 సంవత్సరములు క్రితము ఆరంభింప బడినట్టివి. ఈ సంఘాలు కొన్ని వాటి సంస్థాపకుల పేరును ధరిస్తాయి. మరికొన్ని వారి ఆరాధన దినము యొక్క పేరును పెట్టుకొంటాయి. లేదా వారి విశ్వాసాచరణ పద్ధతి ప్రకారము అవి పిలువబడతాయి. వాటిలో సభ్యులగుటకు వివిధ షరతులుంటాయి, వారి ఆరాధన పలువిధాలుగా ఉంటాది; వారి కిష్టమొచ్చిన రీతిగా వారి బోధ ఉంటాది. ఆశ్చర్య మేమంటే యిదంతయు క్రీస్తు నామమున చేయుచున్నామని వారు చెబుతారు. ఒకరి కొకరు పొసగని ఈ సిద్ధాంతాచరణ పద్ధతు లను క్రీస్తు అంగీకరిస్తాడని వారను కొంటారు.

క్రైస్తవలోకము ఈ విధంగా గజిబిజి అయిపోయి విభాగింపబడి యుండుట ఎంత విచారము! యిదంతయు ఆయన మార్గాన్ని హేళన చేయడం, ఆయన బోధను, త్యాగాన్ని కించపరచడంగాక మరేమవుతాది? అయితే దేవుని మాటలకు కొంతకలపడమో, తీసివేయడమో, చేసిన వీరంతా నాశనమవుతారని గ్రహించే సరికి యిందులో నమ్మతగినది యేదీలేదు

(ప్రక 22:18, 19). వారు నాశనమవుటయేగాక, వారి అబద్ధ బోధలవలన మోసగించబడిన వారందరు నాశనమవుతారు (మత్తయి 7:21-23).

క్రీస్తు సంఘమును ఎన్నడు దయచేసి హేళన చేయవద్దు. సంఘాన్ని కించపరచవద్దు. అది ప్రాముఖ్యము కాదని చెప్పవద్దు. బైబిలును చదువుము, దానిని ధ్యానించుము. సంఘమును గూర్చి తెలిసికొనుము. సంఘము రక్షకుడుకాదు, నిజమే; గాని క్రీస్తు దాని రక్షకుడు. రక్షింపబడిన వారందరినీ ఆయనే దానితో చేర్చుకొంటాడు (ఎఫెసీ 5:23). సంఘాన్ని రక్షించేవాడు క్రీస్తు. అయితే రక్షింపబడాలంటే, పరలోకానికి వెళ్లాలంటే మనము సంఘములో యుండాలి. నిజానికి నేను క్రీస్తు యొక్క ఏకైక సంఘాన్ని గూర్చి మాట్లాడు చున్నాను. బైబిలులో మనకు కనబడేది అదొక్కటే.

సంఘము ప్రాముఖ్యము కాదని చెప్పువానికి ఎంత ధైర్యము! ఎంత బుద్ధిహీనత! క్రీస్తు సంఘమును స్థాపించారు (మత్తయి 16:18). ప్రాముఖ్యత లేనిదానిని, అనవసర మైన దానిని ఆయన స్థాపించారా? సంఘము కొరకు క్రీస్తు సిలువలో చనిపోయారు (ఎఫెసీ 5:25). సంఘమును సంపాదించుట కొరకు ఆయన తన రక్తాన్ని చిందించాడు (అపొ.కా. 20:28). ఆయన మరణం వ్యర్థమా? అనవసరంగా ఆయన తన రక్తాన్ని చిందించారా? మిత్రులారా, ఆలోచించండి, బైబిలులో మనకు కనబడు సంఘము యొక్క శిరస్సు ఎవరో, అది ఎవరి పేరు ధరించాలో, అసలు క్రీస్తు ఎన్ని సంఘములను స్థాపించారో తెలిసికొనండి (కొలస్స 1:18; రోమా 16:16; ఎఫెసీ 4:4-6). ఈ సంగతులను గూర్చి నీవాలోచిస్తే సంఘము మానవ కల్పిత సంస్థ కాదని, అతి ప్రాముఖ్యమైనదనీ, పరలోకానికి వెళ్లడానికి దానిలో సభ్యులై యుండుట అత్యవసరమని నీవు గమనించగలవు.

మనము ప్రభువును, ఆయన మార్గమును, బోధను, సంఘాన్ని, నామాన్ని ప్రేమించాలి మరియు మన ఆత్మల రక్షణార్థము లేఖనములు బోధించే ప్రతి దానిని మనము గౌరవించాలి. మన రక్షణ, ఆరాధన, క్రైస్తవ జీవనము, నిత్యజీవ వాగ్దానములు మొదలగు వాటిని మనం తెలిసికోవాలి; గౌరవించాలి. యివన్నీ తీవ్రమైన సంగతులే. ప్రభువు సంఘాన్ని, ఆయన బోధను కించపరచువారు ఒకానొక దినమందు కించపరచబడుదురు. ఇక్కడ హేళన కాదుగాని ఏడ్పును పండ్లు కొరకుటయును ఉండును.

✍ - జె.సి. ఛోట్

❄ ❄ ❄ ❄

# కావలెను

(Wanted !)

మనము ప్రతి నిత్యమూ పత్రికలలోను, రేడియో, టి.వి.లోను అర్హత గలిగిన అభ్యర్థులు ఆయా ఉద్యోగములకు కావలెనని వింటూ ఉంటాము. కుటుంబ వ్యవస్థ దేశానికి వెన్నెముకలాంటిది. ఈ లోకములో మొట్టమొదట ఈ కుటుంబ వ్యవస్థాపకుడు దేవుడే. ఆదిదంపతులైన ఆదాము హవ్వలను ఆశీర్వదించి ఆయన మొదటి వివాహకర్తగా వ్యవహరించెను (ఆది 1:28, ఆది 2:21-25). కనుక కుటుంబము పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఆయన నియమ నిబంధనలకు అనువైన జీవితవిధానము కలిగినవారు కావలెనని దేవుని నిర్ణయం. కుటుంబములోని తండ్రి, తల్లి, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు, బిడ్డలు ఎట్టివారైయుండవలెనో దైవ లేఖనముల ద్వారా తెలుసుకొందము.

1. **అబ్రహాములాంటి తండ్రులు కావలెను:-** అబ్రహాము బాబిలోనియాలోని "ఊరు" పట్టణ నివాసి. భాబిలోనియా వారు అనేక మంది దేవుండ్లను దేవతలను పూజించెడివారు. వీరు నీరు, నిప్పు, సూర్య చంద్ర నక్షత్రములను ప్రకృతి శక్తులను పూజించెడివారు. ఊరు పట్టణస్తులు "షామాస్" అనే సూర్యదేవుని; సీను అనే చంద్ర దేవుని ఆరాధించెడివారు. సీను అనే చంద్ర దేవుని భార్య పేరు నిన్‌గళ్. నీనా అనేది ఆమెకు మరియొక పేరు. ఈ పేరు మీదుగా ఆ పట్టణమునకు నీనెవె అని పేరు పెట్టిరి. ఇట్టి వాతావరణములో విగ్రహారాధికులైన కుటుంబములో తెరహునకు అబ్రహాము జన్మించెను (యెహోషువ 24:2). "ఎట్లనగా యెహోవా అబ్రహామును గూర్చి చెప్పినది అతనికి కలుగజేయునట్లు తన తరువాత తన పిల్లలను, తన యింటి వారును నీతి న్యాయములు జరిగించుచు, యెహోవా మార్గమును గైకొనుటకు అతడు వారికాజ్ఞాపించునట్లు నేనతని నెరిగియున్నాను" (ఆది 18:19). అబ్రహాము సంతానం లేకపోవుటను బట్టి నిరాశ చెందినను, దేవునిపట్ల పరిపూర్ణ విశ్వాసము కలిగి వృద్ధాప్యములో కుమారుని కని, తన యేక కుమారుని దేవుని కర్పింప వెనుదీయకుండెను (ఆది 15:1-3, హెబ్రీ 11:17-19; ఆది 12:1-6). శారా అబ్రహాము యొక్క భౌతిక, ఆత్మీయ పరిస్థితులలో సహకరించి ఇస్సాకును దైవభీతిలో పెంచుటలో అబ్రహామునకు సహకరించినది. మగని మనోభావము గమనించి దైవాజ్ఞానుసారముగా ప్రవర్తించిన మంచి ఇల్లాలుగా శారాను గూర్చి చెప్పవచ్చును (1 పేతు 3:6).

**2. హన్నా లాంటి తల్లులు కావలెను:-** తల్లి ఒడే బిడ్డకు బడి అన్నారు పెద్దలు. అడ్డాల నాటినుంచి మంచి శిక్షణ యిస్తే గడ్డాల నాటికి చక్కటి ప్రయోజకులు కాగలరు. ఎల్కాన భార్యయైన హన్నా సంతానము లేక బహుదుఃఖాక్రాంతురాలై వచ్చి యెహోవా సన్నిధిని ప్రార్ధన చేయుచు బహుగా ఏడ్చుచు సైన్యములు కధిపతి యగు యెహోవానీ సేవకురాలనైన నాకు కలిగియున్న శ్రమను చూచి నీ సేవకురాలనైన నన్ను మరువక జ్ఞాపకము చేసికొని, నీ సేవకురాలనైన నాకు మగపిల్లను దయ చేసిన యెడల వాని తల మీదికి క్షౌరపు కత్తి యెన్నటికి రానియ్యక వాడు బ్రతుకు దినము లన్నిటను నేను వానిని యెహోవానగు నీకు అప్పగింతునని మ్రొక్కుబడి చేసికొనెను. తాను మ్రొక్కిన రీతిగా ఆమెకు కుమారుడు కలిగెను. ఆ కుమారుని దేవునికి ప్రతిష్ఠించి ఉగ్గు పాలతోనే భక్తి విశ్వాసములు నేర్పించెను. కనుకనే అతడు ఇశ్రాయేలీ యులకు చివరి న్యాయాధిపతిగాను మొదటి ప్రవక్తగాను ఉండెను (1 సమూ 1:10-11, 19-20, 28; 1 సమూ 7:19-16). హన్నా యొక్క ప్రార్ధన జీవితపు నీడ పసితనములోనే సమూయేలుపై పడినది. కనుకనే అతడు మరణము వరకు మంచి విశ్వాస జీవితమును జీవించెను. హన్నాలాంటి తల్లులు ఉంటే నేటి సంఘములో సమూయేలు లాంటి కుమారులు తప్పక యుందురు. కనుక క్రీస్తు సంఘానికి హన్నాలాంటి తల్లులు కావలెను.

**3. క్రీస్తు వంటి కుమారులు కావలెను:-** యేసు క్రీస్తు బాల్యము నుండి ఆయన తల్లిదండ్రులను గౌరవించి వారికి లోబడి యుండెను. "అంతట ఆయన వారితోకూడ బయలుదేరి నజరేతునకు వచ్చి వారికి లోబడియుండెను. యేసు జ్ఞానమందును వయస్సునందును దేవుని దయ యందును మనుష్యుల దయయందును వర్ధిల్లుచుండెను" (లూకా 2:51-52). ఆయన కుటుంబ బాధ్యతలను నిర్వర్తించుటలో ఘనమైయుడు (యోహాను 19:25-27). భౌతిక సంబంధమైన తల్లి దండ్రులకు లోబడినట్లే పరలోకపు తండ్రికి లోబడెను. నేను నా తండ్రి పనుల మీద నుండవలెనని మీరెరుగరా? అని మరియ యోసేపులతో చెప్పెను (లూకా 2:49). యేసు వారిని చూచి నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటయు, ఆయన పని తుదముట్టించుటయు నాకు ఆహారమై యున్నది అని శిష్యులతో చెప్పెను (యోహాను 4:34). దేవుని వాక్యము విని, దాని ప్రకారము జరిగించు వీరేనా తల్లియు నా సహోదరులునని వారితో చెప్పెను (లూకా 8:20-21, లూకా 11:27-28). క్రీస్తు పరలోకపు తండ్రిని ఆనంద

పరచిన కుమారుడు (మత్తయి 3:17). ఏ తరము బిడ్డలకైనా యేసు ఆదర్శ ప్రాయుడు. మనలను రక్షించుటకు భువి కేతెంచిన దైవ సుతుడు (ఎఫెసీ 6:1-4, కొలస్స 3:20-21, సామె 22:6).

**4. హనన్యా నెహెమ్యాలవంటి అన్నదమ్ములు కావలెను:-** క్రీ॥పూ॥ 586 సం॥లో నెబుకద్నెజరు పరిపాలనలో కాలిపోయి పడిపోయిన యెరూషలేము విషయములో నెహెమ్యా బహు దుఃఖము పొందెను (నెహెమ్యా 2:1-5). యెరూషలేము యొక్క ప్రాకారములు తిరిగి కట్టుటకు పూనుకొందము రండని ప్రజలను ప్రేరేపించుటకు నెహెమ్యా నాయకత్వము వహించును (నెహెమ్యా 2:15-20). "ఈ ప్రకారముగా ఏబాలు మాసము యిరువది అయిదవ దినమందు, అనగా ఏబది రెండు దినములకు ప్రాకారము కట్టుట సమాప్త మాయెను" (నెహెమ్యా 6:15-16). ఈ పనిలో అతని సహోదరుడైన హనన్యా సహకరించెను (నెహెమ్యా 7:1-2). ఈనాటి సంఘములో నెహెమ్యా హనన్యాలవలే ఐక్యత కలిగి దేవుని పనిచేసినచో ఎంత మేలు ఎంత మనోహరము (కీర్తనలు 133:1-2).

**5. మరియ మార్తల వంటి అక్కాచెల్లెండ్రు కావలెను :-** మరియ మార్త అనే అక్క చెల్లెండ్రు కలసి క్రీస్తుకు పరిచర్య చేసిరి. యేసు తాను మృతులలో నుండి లేపిన లాజరు ఉన్న బేతనియకు వెళ్లెను. అక్కడ ఆయనకు విందు చేసిరి. మార్త ఉపచారము చేసెను. మరియ మిక్కిలి విలువగల అచ్చజటామాంసి అత్తరు ఒక సేరున్నర ఎత్తు తీసుకొని యేసు పాదములకు పూసి తన తలవెండ్రుకలతో ఆయన పాదములు తుడిచెను (యోహాను 12:14, యోహాను 11:2-3, 5; లూకా 10:38). క్రీస్తుకు హృదయ పూర్వకముగా సమర్పించుకొని పరిచర్య చేయుటకు మరియ మార్తలవలె నిశ్చయించు కొనినవారు ఉండుట క్రైస్తవ్యానికి ఎంతో ప్రోత్సాహకరము.

**6. దానియేలువంటి అధికారులు కావలెను :-** దానియేలు యెరూషలేము నుంచి బబులోనుకు కొనిపోబడిన వారిలో ఒకడు. రాజభోజనమును ద్రాక్షారసమును వద్దని తృణీకరించినవాడు (దాని 1:4, 8-16). దేవుడు జ్ఞానమును సకలశాస్త్ర ప్రవీణతయు వివేచనయు అనుగ్రహించెను. వారిలో దానియేలు సకల విధములగు దర్శనములను స్వప్నభావములను గ్రహించి తెలివికలవాడై యుండెను (దాని 1:17, దాని 5:12). దర్యావేషువల్ల ప్రధానిగా ఏర్పరచబడిన వ్యక్తి. దానియేలువంటి అధికారులు ఈనాటి సమాజానికి కావలెను. ప్రియ మిత్రమా నీవు అధికారివో అనధికారివో నీవు ఎవ్వరు అయినను నీవు చేయు

పనిలో దానియేలువలె నమ్మకము, నీతి నిజాయితీయులు కల్గిజీవించు (దాని 6:5).

**7. పౌలువంటి ప్రసంగీకుడు కావలెను:-** ప్రతి సువార్తికుడు పౌలువలె ఉండుట బహుమంచిది. క్రైస్తవుడు కాక పూర్వము సంఘమును హింసించుట యందు ఎంతటి ఆసక్తి పౌలు కల్గి యుండెనో క్రైస్తవుడైన పిదప క్రీస్తు సంఘముపట్ల అత్యాశక్తిని కల్గియుండెను. నేను క్రీస్తుతో కూడా సిలువ వేయబడి యున్నాను, ఇకను జీవించు వాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి నా కొరకు తన్ను తాను అప్పగించుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించుచున్నాను (గలతీ 1:20). అతడు అన్యజనుల కొరకు ఏర్పరచబడిన అపొస్తలుడు (గలతీ 1:13-15, గలతీ 2:7). సువార్త ప్రకటించవలసిన భారము నా మీద మోపబడియున్నది. అయ్యో, నేను సువార్తను ప్రకటింపక పోయిన యెడల నాకు శ్రమ (1 కొరి. 9:16, 2 కొరి. 11:26-28, 2 కొరి. 12:9-10, ఫిలిప్పీ 4:13). ఇతడు ప్రభువు కొరకు తన్ను తానే సమర్పించుకొనెను. చక్కని ఉపన్యాసకుడు. ఈలాంటి సమర్పణా జీవితంగల సువార్తికులు కావలెను.

అబ్రాహాము లాంటి తండ్రివలె, హన్నా వంటి తల్లివలె, క్రీస్తు వంటి కుమారునివలె, నెహెమ్యా హనన్యాలవంటి అన్నదములవలె, మార్త మరియ లాంటి అక్కచెల్లెండ్రవలె దేవుని కుటుంబములో కలసి జీవించుదము.

✍ - పి. చంద్రశేఖర్

❄ ❄ ❄ ❄


క్రీస్తు సంఘములు సమర్పించుచున్న **సత్యవాణి** టి.వి.

కార్యక్రమములను ప్రతి మంగళవారం ఉదయం 6:30 గం॥లకు

**మా టి.వి.** లోను మరియు ప్రతి శనివారం ఉదయం 6:30 గం॥లకు

**తేజ** ఛానల్‌లోను చూడండి.


<u>గమనిక</u> : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.

# ఆఖరి ప్రవక్తా ?

(The Last Prophet ?)

మార్కు 12:1-12లో యేసు చెప్పిన ఒక ఉపమానం ఉన్నది. దాని అంశము? దేవుడు ప్రజల యొద్దకు ప్రవక్తల వెంబడి ప్రవక్తలను పంపెను వారందరూ దూషింప బడిరి. చంపబడిరి. చివరిగా దేవుడు తన కుమారుని పంపెను. ఆయన కుమారుని గూర్చి వారేమి చేసిరి? ఆయనను చంపుటకు కూడా వారు సంకల్పించిరి! మార్కు 12:6లో యేసు ఒక ఆసక్తికరమైన సంగతి చెప్పెను. "ఇంకను అతనికి ప్రేమ కుమారుడు ఒకడు ఉండెను గనుక వారతని సన్మానించెదరనుకొని తుదకు వారి యొద్దకు అతని పంపెను".

యేసే పంపబడిని వారిలో ఆఖరివాడైతే, యేసు పరలోకమునకు తిరిగి వెళ్లిన తరువాత పరిశుద్ధాత్మావేశము వలన లేఖనములను వ్రాయు మనుష్యులెట్లుండిరి? యేసు ఆరోహణమైన తరువాత ఫిలిప్పుకు ప్రవచించు నలుగురు కుమార్తె లెట్లుండిరి? (అపో.కా. 21:9). కొరింథీయులు ప్రవచించుటకు ఆసక్తితో అపేక్షింకవలెనని పౌలు ఎట్లు చెప్పగలిగెను? (1 కొరింథీ 14:39).

దీనికి జవాబు యోహాను 17:7లో యేసు చెప్పిన దానిలో యున్నది: "నీవు నాకను గ్రహించిన మాటలు నేను వారికిచ్చి యున్నాను" (యోహాను 17:7). మరల మత్తయి 28:20. "నేను మీ కాజ్ఞాపించిన వన్నియు వారు గైకొనవలెనని వారికి బోధించుడి" యని చెప్పెను. పరిశుద్ధాత్మ ద్వారా అపొస్తలులు యేసు యొక్క వర్తమానమునే కొనసాగించిరి. వారి బోధలు, అద్భుతములు సూచక క్రియల ద్వారా అవి ధృఢపరచబడడం మార్కు 16:20లో చెప్పబడింది. తరువాత ఆ గొప్ప రక్షణ మొదట బోధించుట చేత ఆరంభమై పరిశుద్ధాత్మ సహాయమున అద్భుతములు సూచక క్రియల ద్వారా వినిన వారి చేత ధృఢపరచబడెనని చెప్పబడెను (హెబ్రీ 2:3-4). 2 పేతురు 1:3-4లో ఆయన మన జీవముకు భక్తికి కావలసినవన్నియు అనుగ్రహించెనని చెప్పబడినది. ఆ విశ్వాసము పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింప బడెనని యూదా : 3లో తెలియజేయబడెను. ఈయబడిన సువార్త గాక వేరొక సువార్తను ప్రకటింపరాదని పౌలు మనలను హెచ్చరించెను (గలతీ 1:8). మొదటి శతాబ్దములో ఈయబడిన అద్భుతవరములు తాత్కాలిక వరములు (1 కొరింథీ 13).

ఆధునిక ప్రవక్తలు ఎవరు లేరు. క్రొత్త బయల్పాటు యేమి లేదు. క్రొత్త ప్రవచనం యేమీ లేదు. యేసు ప్రభువు తెచ్చిన వర్తమానమే ఆఖరిది. యేసు పరమున కారోహణుడైన తరువాత యున్న ఆత్మావేశ పరులు వర్తమానము యేసుదే.

హెబ్రీ పత్రిక లేఖకుడిట్లను చున్నాడు: "పూర్వకాలమందు నానా సమయములలోను నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను" (హెబ్రీ 1:1-2).

- బిల్ కీల్

# క్రైస్తవ కీర్తనలు

క్రైస్తవ కీర్తనలు పుస్తకము మరల ముద్రించబడినది. కొన్ని క్రొత్త కీర్తనలు చేర్చబడి 238 కీర్తనలతో అందముగా ప్లాస్టిక్ కవరుతో బైండింగ్ చేయబడినది. ఒక్కొక్క కీర్తన పుస్తకం పోస్టేజితో సహా 30/- రూ॥లు మాత్రమే. వలయువారు దిగువ చిరునామాకు M.O. పంపి పొందవచ్చును.

*Satya Vani*

P.O. Box - 80, Kakinada

A.P. - 533 001.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:

SATYA VAKKU
P.O. Box 80,
Kakinada - 533 001

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.